క్లుప్తంగా

మహానందీశ్వరుడికి వెండి చెంబు విరాళం



ఏఈఓ ఎరమల మధుకు వెండి చెంబు అందిస్తున్న దాతలు

మహానంది: మహానందీశ్వరుడికి హైదరాబాద్‌కు చెందిన సూర్యప్రకాష్, ఉమాశంకర్, కుటుంబ సభ్యులు శనివారం 400 గ్రాముల వెండి చెంబును విరాళంగా అందించారు. దాత కుటుంబ సభ్యులను ఏఈఓ ఎరమల మధు, సిబ్బంది నాగభూషణం తదితరులు కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్ల ప్రసాదాలు అందించి సన్మానించారు.

కబడ్డీ విజేత మండ్లెం



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పాములపాడు: మండలంలోని వాడాల గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో మండ్లెం జట్టు విజయం సాధించింది. 3 రోజులుగా జరుగుతున్న కబడ్డీ పోటీలు శనివారంతో ముగిశాయి. మండ్లెంతో పాటు రెండో స్థానంలో ఓంకారం, మూడో స్థానంలో శెకునాల, నాల్గో స్థానంలో రేగడగూడూరు జట్లకు వరుసగా రూ.20,000, రూ. 15,000, రూ. 10,000, రూ. 5,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 32 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు.

పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగజ్యోతి

మిడుతూరు: మండల పరిధిలోని తలముడిపి చెక్‌పోస్టు సమీపంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు 91 సర్వే నంబర్‌లో 65 సెంట్ల స్థలాన్ని ఆత్మకూరు ఆర్డీఓ నాగజ్యోతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ రికార్డులు(ఆర్ఓఆర్, ఆర్ఎస్ఆర్, లాండ్ కన్వర్షన్‌కు సంబంధించిన పత్రాలు) క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ కృష్ణుడు, వీఆర్వో ఖాదర్ బాషా ఉన్నారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు



నాటుసారాను చూపుతున్న ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ

నందికొట్కూరు: నాటుసారా తయారు చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ రామాంజనేయులు హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని దామగట్ల వద్ద నాటుసారా అమ్ముతున్న బోయ దుర్గేషను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరుపరచగా 15 రోజుల రిమాండ్ విధించారు. చట్టానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాని సీఐ తెలిపారు. ఎస్ఐ జప్రూల్లా, హెడ్ కానిస్టేబుళ్లు శంకర్ నాయక్, పద్మనాభం, కానిస్టేబుల్స్ శివన్న, సుధీర్‌కుమార్, మధుప్రసాద్ ఉన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాల్లో జాప్యంపై ఆగ్రహం



షెడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏపీడీ

కొత్తపల్లి: మండలంలో గోకులం షెడ్ల నిర్మాణ పనులు జాప్యం కావడంపై ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ అన్వరాబేగం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల పరిధిలోని వీరాపురం, గువ్వలకుంట్ల, కొత్తపల్లి, నందికుంట గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లను పరిశీలించారు. మండలంలో మొత్తం 22 మంది రైతులకు షెడ్లు మంజూరయ్యాయని తెలిపారు. అందులో వీరాపురం 4, గువ్వలకుంట్ల 1, కొత్తపల్లి 2, నందికుంట 1 నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఈనెల 9వ తేదీలోపు పూర్తిచేయించాలని ఆదేశించారు. త్వరితగతిన పూర్తి చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దోమల నివారణ చర్యలు

మహానంది: మహానందిలో దోమల నివారణకు చర్యలు తీసుకున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉన్న వైనంపై ఇటీవల సాక్షి దినపత్రికలో దోమలు బాబోయ్ శీర్షికన ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం రాత్రి అధికారులు ఆటోలో ఫాగింగ్ మిషన్‌ను ఏర్పాటు చేసి ఆలయ పరిసరాల్లో ఫాగింగ్ చేయించారు.

చలికాలం.. వ్యాధులకు గాలం

- గొర్రెలు, మేకలకు తిక్కరోగం సోకే ప్రమాదం
- ముందస్తు జాగ్రత్తలు జీవాలకు రక్ష

చలికాలంలో గొర్రెలు, మేకల పెంపకందారులు ముందస్తు చర్యలు చేపట్టి తమ జీవాలను కాపాడుకోవాలని మండల పశు వైద్యాధికారి అనూష సూచించారు. జీవాల పట్ల ఏమాత్రం అజాగ్రత్త వహించినా వ్యాధుల బారిన పడే ప్రమాదముందన్నారు. చలికాలం ప్రారంభం కావడంతో జీవాల యజమానులు, కాపర్లు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఆమె మరింత సమాచారం ఇచ్చారు. – బండిఆత్మకూరు



పశు వైద్యాధికారిని- అనూష

శీతాకాలం మూగ జీవాలకు చాలా ప్రతికూలంగా ఉంటుంది. ఈ కాలంలో జీవాలకు వ్యాధులు ప్రబలినట్లైతే వ్యాధులను అరి కట్టడం కష్టం. జీవాల పెరుగుదలకు ఉష్ణోగ్రతలు అనుకూలంగా ఉన్నప్పటికీ అధిక చలి, వాతావరణంలో తేమ, బాహ్య పరాన్నజీవుల బెడద వల్ల అధిక ఒత్తిడికి గురై పెరుగుదల క్షీణిస్తుంది. దీనికి తోడు వాతావరణంలో అధికంగా చలి, తేమ ఉండటం వల్ల మూగజీవాలకు పీపీఆర్ (పారుడు) వ్యాధి, ఆర్స్ వ్యాధి, మసూచి, చిటుక తదితర వ్యాధులు చలి కాలంలో వస్తాయి. వ్యాధికారక సూక్ష్మజీవులు శరీరంలో ఉండడం వల్ల మందలో ఉన్న మిగిలిన గొర్రెలు, మేకలకు వ్యాపిస్తుంది. వీటి పెంపకందారులు తగిన జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. ఒకవేళ వ్యాధి సోకినా తీవ్రత తగ్గించేందుకు అవకాశం ఉంది. మరణాలను అరికట్టవచ్చు.

కీటకాలతో జాగ్రత్త

దోమలు, కీటకాల నుంచి గొర్రెలకు, మేకలకు చలికాలంలో తిక్క (సర్వ) రోగం ప్రభావం ఎక్కువగా ఉంటుంది. మేకలలో శిలీంధ్రాల వల్ల వచ్చే కంటేజియస్ కాప్రైన్ ప్లూరో నిమోనియా (సీసీపీపీ)వ్యాధి వల్ల అధిక మరణాలు సంభవిస్తాయి. నదులు, వాగులు, వంకల వెంట సంచరించే గొర్రెలు, మేకలు తిక్క రోగం బారిన పడతాయి. దోమకాటు ద్వారా వచ్చే ఈ వ్యాధిని త్వరగా గుర్తించక పోతే జీవాలు మృతి చెందే ప్రమాద ఉంది. పెంపకందారులు ముందుగా వ్యాధిని గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలి.



పొలంలో గొర్రెలు , మేకలు

చలి తీవ్రత ఎక్కువైతే..

చలి తీవ్రత ఎక్కువైతే న్యూమోనియా (ఉమ్మి) రోగం వచ్చే ప్రమాదం ఉంది. ఇక గొర్రెలు, మేకలను చలి బారి నుంచి రక్షించడం కోసం పాకలు ఏర్పాటు చేసి వాటికి న్యూమోనియా (ఉమ్మి) వ్యాధి సోకుండా కాపాడుకోవాలి. మండలంలో దాదాపు 19 వేలకు పైగా గొర్రెలు, మేకలకు ఉన్నాయి. వీటిపై దాదాపు 100 కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. జీవనాధారమైన జీవాలకు వ్యాధులు సోకకముందే జాగ్రత్తలు తీసుకోవాలని. ఒకవేళ ఏదైనా ఒక జీవానికి వ్యాధి సోకితే దాన్ని మంద నుంచి వేరు చేసి ప్రత్యేక ప్రదేశంలో ఉంచి చికిత్స చేయించాలి. అలాగే వ్యాధి సోకిన జీవాలకు సులువుగా జీర్ణమయ్యే ఆహారం, పరిశుభ్రమైన తాగునీరు ఇవ్వాలి. పూర్తిగా వ్యాధి నుంచి కోలుకున్న తర్వాత మాత్రమే వాటిని మందలో కలపాలి. అలాగే వ్యాధులు సోకిన జీవాలను ఇతర ప్రాంతాలకు తీసుకు వెళ్లకూడదు. అలా చేస్తే వ్యాధి తీవ్రత పెరిగి అవి చనిపోతాయి. ఒకవేళ గొర్రె, మేక మృతి చెందితే దాని కళేబరాన్ని ఊరికి దూరంగా తీసుకువెళ్లి లోతుగా గొయ్యి తవ్వి సున్నం వేసి పూడ్చిపెట్టాలి. అవి చనిపోయిన ప్రదేశాన్ని క్రిమిసంహారక ద్రావణంతో శుభ్రం చేయాలి. చనిపోయిన జీవం తినగా మిగిలిన గడ్డి కూడా కాల్చివేయాలి. నీటి పాత్రలను క్రిమి సంహారక ద్రావణంతో శుభ్రం చేసి ఎండలో ఆరబెట్టాలి.

నివారణ- జాగ్రత్తలు ఇలా..

ముందస్తు చర్యల్లో భాగంగా జీవాలకు సోకే పారుడు వ్యాధికి పీపీఆర్ వ్యాక్సిన్, మశూచి వ్యాధికి షీప్ ఫాక్స్ గోట్ ఫాక్స్ వ్యాక్సిన్, దొమ్మ వ్యాధికి హెచ్ఎస్ వ్యాక్సిన్, చిటుకు వ్యాధికి ఈటీ వ్యాక్సిన్ వేయించాలి. జీవాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైతే యాంటీబయటిక్, యాంటీ ఇన్ఫ్లమేటరీ మందులను వాడాలి. వీటితోపాటు రాత్రి వేళల్లో జీవాలను షెడ్లలోనికి తోలాలి లేకుంటే అధిక మంచువల్ల చర్మ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. షెడ్లలోకి చల్లగాలి సోకకుండా చుట్టూ పట్టలు కట్టాలి. సాయంత్రం పాకలు, మందల వద్ద వేపాకు ధూపం వేస్తే కీటకాలు మంటకు ఆకర్షితమై నశిస్తాయి. కాబట్టి జీవాలకు సోకే తిక్క రోగం నుంచి కాపాడుకునేందుకు కొంత అవకాశం ఉంటుంది. చలి అధికంగా ఉండటం వల్ల పసు గ్రాసంపై మంచు అధికంగా ఉంటుంది. అందువల్ల వేకువజామున మేతకు వదలకూడదు. జీవాల కోసం నిలువ ఉంచిన పశుగ్రాసం, దాణా, ముడి పదార్థాలను తేమకు గురైతే అవి బూజుపట్టి అఫ్లోటాక్సిన్ల ప్రభావానికి గురికాకుండా జాగ్రత్త పడాలి.

ఏఓకు బదిలీ సన్మానం



నాగరాజు రావును సన్మానిస్తున్న ఎంపీడీఓ, జెడ్పీటీసీ

పగిద్యాల: మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏఓ)గా విధులు నిర్వహించి కర్నూలు బీసీ కార్పొరేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఏఈఓ)గా బదిలీపై వెళ్లిన నాగరాజురావును కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యురాలు పుల్యాల దివ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఎంపీడీఓ సుమిత్రమ్మ, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఎంఈఓ సుభాన్, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి ఆయన్ను ఘనంగా సన్మానించారు.

మహానందిలో 10న లక్ష పుష్పార్చన

మహానంది: శివకేశవులకు నిలయమైన మహానందిలో ఈనెల 10న వైకుంఠ ఏకాదశి సందర్భంగా లక్ష పుష్పార్చన నిర్వహించనున్నట్లు ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉత్సవ మూర్తులకు విశేష అలంకరణ చేపట్టి ఉత్తరద్వారంలో భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. అలాగే వివిధ రకాల 500 కిలోల పుష్పాలతో కోదండ రాముల వారికి లక్షపుష్పార్చన పూజలు ఉంటాయన్నారు. నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, రామపుల్లమ్మ దంపతుల ఆర్థిక సహకారంతో కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు.

రాష్ట్ర వైజ్ఞానిక పోటీలకు వేంపెంట విద్యార్థులు



డీఈఓ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థులు

పాములపాడు: మండలంలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర వైజ్ఞానిక పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం క్రిష్ణమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3వ తేదీ నంద్యాలలో సౌతర్న్ ఇండియా సైన్స్ ఫెస్ట్ 2024–25 డిస్టిక్ లెవెల్ సైన్స్ ఫెయిర్‌లో 9వ తరగతి విద్యార్థులు జగదీశ్వర్, జోష్ పాల్గొన్నారన్నారు. వేస్ట్ వాటర్ ప్యూరిఫికేషన్ అండ్ రీ యూజ్ థీమ్ విభాగంలో మొదటి స్థానం సాధించారన్నారు. మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్ అందజేశారని తెలిపారు. త్వరలో విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా చర్యలు తీసుకుందన్నారు. ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రఘురామ ఆచార్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● శ్రీశైలంప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రిన్సిపాల్ ఆర్.మారెన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందజేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం కళాశాలల్లో పథకాన్ని ప్రవేశపెట్టిందనిన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ కలిముల్లాబాషా, హైస్కూల్ హెచ్ఎం ఈశ్వరీబాయి, టీడీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, మల్లేష్, శ్రీను, నాగేశ్వరరావు, బీజేపీ నాయకులు ఎస్‌వీఎస్ మల్లికార్జున పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

మిడుతూరు: విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిత్త జయసూర్య అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నన భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులు డ్రాపౌట్స్ కాకుండా ఉండేందుకు ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించినట్లు చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ శంకర్ నాయక్, రమేష్‌రెడ్డి, కడియం వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

పాములపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు సింగిల్ విండో మాజీ చైర్మన్ ఆళ్లగడ్డ హరిసర్వోత్తమరావు ప్లేట్లు, గ్లాసులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఎంఈఓ సుభాషిణిదేవి, దేవాలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, మాజీ ఉపసర్పంచ్ నబీరసూల్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



కొత్తపల్లి: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ మేరి



పగిద్యాల: మాట్లాడుతున్న ఎంపీడీఓ సుమిత్రమ్మ

కొత్తపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు ఎంపీడీఓ మేరి అన్నారు. శనివారం కొత్తపల్లి-2, గువ్వలకుంట్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ (ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్) డే నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను పిల్లల తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, ఈఓఆర్డీ బోయేజ్ బాబు, సర్పంచ్ లక్ష్మీదేవి, టీచర్లు రామాంజనేయులు, లోకేంద్రనాథ్ పాల్గొన్నారు.

-పగిద్యాల/జూపాడుబంగ్లా: పిల్లల మేధోశక్తి, శారీరక అభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు తోడ్పడుతాయని ఎంపీడీఓ సుమిత్రమ్మ అన్నారు. మండలంలోని అన్ని ఈసీసీఈ డేను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఐదేళ్ల లోపు పిల్లల కోసం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పిస్తున్నట్లు తెలిపారు. ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి పాల్గొన్నారు. అలాగే జూపాడుబంగ్లా మండల వ్యాప్తంగా ఈసీసీఈ డేను నిర్వహించారు.

బ్యాంక్ ఖాతా తప్పనిసరి

జూపాడుబంగ్లా: ప్రతి వ్యక్తి బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కిశోర్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని తాటిపాడు గ్రామంలో బ్యాంక్ లావాదేవీలు, రుణాల మంజూరు, పొదుపులపై ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు అటల్ బిహారి యోజన ఇన్సురెన్స్, జననీ సుకన్య యోజన పథకం, అటల్ పెన్షన్ యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు బ్యాంక్ ఖాతా నంబర్లు అడిగితే ఇవ్వరాదన్నారు. సైబర్, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌మేషన్ సభ్యులు శివ, నాగరాజు, బిజినెస్ కరస్పాండెంట్ నారాయణ, టీపీ చిన్నా, ఫీల్డ్ అసిస్టెంట్ లింగన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్యాంక్ మేనేజర్ కిశోర్‌బాబు

సదస్సుల్లో భూ సమస్యలకు పరిష్కారం



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్



దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ పద్మావతి



మాట్లాడుతున్న తహసీల్దార్ రత్నరాధిక

నందికొట్కూరు: రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శనివారం పట్టణంలోని మద్దిగట్ల ప్రాంతంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూములకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా అర్జీలు ఇవ్వాలన్నారు. అర్జీలపై సమగ్ర విచారణ చేపట్టి పరిష్కారం చూపుతామని తెలిపారు. కార్యక్రమంలో డీటీ సత్యనారాయణ, సర్వేయర్ త్యాగరాజు, వీఆర్వోలు నరసింహులు, వెంకటేశ్వర్లు, మనోహర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 14 వినతులు

మిడుతూరు: మండల పరిధిలోని మాసపేట గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 14 వినతులు వచ్చినట్లు ఆర్ఐ జహంగీర్ బాషా తెలిపారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐ సూచించారు. అనంతరం రైతుల నుంచి వినతులు స్వీకరించారు.

భూ సమస్యలపై అర్జీల స్వీకరణ

పాములపాడు: రెవెన్యూ సదస్సులో ఇచ్చే ప్రతి అర్జీని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. శనివారం మండలంలోని ఇస్కాల గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సర్వే కోసం 2, మ్యూటేషన్ కోసం 3 చొప్పున అర్జీలు వచ్చినట్లు తెలిపారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సుప్రియ, ఆర్ఐ ఖాజాబీ, సర్వేయర్ కలిముల్లా, వీఆర్వోలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 5 దరఖాస్తులు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఏ.కోడూరు గ్రామంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 5 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ పద్మావతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీలైనంత త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం

ఆత్మకూరు: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రత్నరాధిక తెలిపారు. శనివారం మండలంలోని నల్లకాల్వ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పట్టాదారు పేరు మార్పు కోసం 4 దరఖాస్తులు, ఆన్‌లైన్ కోసం 8, జాయింట్ ఎల్‌పీఎం కోసం 4 దరఖాస్తులు అందజేశారు. వాటిపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

వలసల నివారణలో ప్రభుత్వం విఫలం

కొత్తపల్లి: మండలంలో వలసలను నివారించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వి.యేసురత్నం, మండల కార్యదర్శి ఎన్. స్వాములు విమర్శించారు. శనివారం కొత్తపల్లిలో వారు మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటికే గువ్వలకుంట్ల, వీరాపురం గ్రామాల నుంచి వందలాది కుటుంబాలు వలసలు వెళ్లాయన్నారు. పది రోజుల్లో శివపురం, సింగరాజుపల్లి, ముసలమడుగు, ఎర్రమఠం, ఎదురుపాడు కొక్కెరంచ తదితర గ్రామాల నుంచి వలసలు వెళ్లడానికి సిద్ధమవుతున్నారన్నారు. ఉపాధి కూలీలకు గ్రామసభల్లో సిద్ధం చేసిన పనులు ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా గ్రామసభల్లో సిద్ధం చేసిన పనులకు ఆమోదం తెలిపి ప్రతి ఉపాధి కూలీకి పనులు కల్పించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

శిరివెళ్ల: రాష్ట్ర స్థాయి సీనియర్ మీట్ కబడ్డీ పోటీలకు ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి శనివారం తెలిపారు. గత నెలలో నందికొట్కూర్‌లో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో బీకాం తృతీయ సంవత్సర విద్యార్థి సాయి,. బీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థి సౌమ్య సత్తా చాటారన్నారన్నారు. కళాశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.


బ్రెయిలీ లిపి వరంలాంటిది



మాట్లాడుతున్న ఎంఈఓ-2 సుభాషిణి దేవి

పాములపాడు: అంధుల జీవితాలకు బ్రెయిలీ లిపి ఒక గొప్ప వరమని ఎంఈఓ-2 సుభాషిణి దేవి అన్నారు. శనివారం స్థానిక భవిత సెంటర్‌లో బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్రెయిలీ లిపితో సాధారణ విద్యార్థులతో సమానంగా అంధ విద్యార్థులు గొప్ప స్థాయిలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. లిపి ఆవిర్భావం గురించి వివరించారు. దివ్యాంగులతో ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ప్రోత్సహించాలని సూచించారు. సైనికులు రహస్యాలను తెలుసుకోవడానికి ఈ లిపి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు శ్రీనివాసులు, స్వామి శేఖర్, రాంప్రసాద్, ఖాజాహుసేన్, ద్రాక్షాయిణి, శివనాగలక్ష్మి, విజయ్‌బాబు, రవి, రంగారెడ్డి, రాజశేఖర్, ఐఈఆర్టీ లు షంషుద్దీన్, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● పుడమి తల్లికి పుష్పాభిషేకం!



నేలంతా బంతిపూలే. ఎరుపు, పసుపు వర్ణాల పుష్పాలతో పంట పొలాలు కళకళలాడుతూ కనిపిస్తున్నాయి. ఎటు చూసినా పుష్పాలే దర్శనమిస్తుండటంతో పుడమితల్లికి పుష్పాభిషేకం చేసినట్లు అగుపిస్తున్న ఈ దృశ్యం మహానంది సమీపంలో శనివారం కనిపించగా 'సాక్షి' కెమెరాలో బంధించింది. – మహానంది

మురుగు కష్టాలు

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని సంతజూటూరు గ్రామంలో పారిశుద్ధ్యం లోపించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తూ పరిసరాలు కంపు కొడుతున్నాయి. పంచాయతీ సిబ్బంది కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం కానీ ఫాగింగ్ చర్యలు చేపట్టడం కానీ చేయకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. వ్యాధుల బారిన పడకముందే అధికారులు స్పందించి పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

34 మంది మత్స్యకారులపై బైండోవర్ కేసు

పగిద్యాల: కృష్ణానది పరివాహక గ్రామాలు నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పగిడ్యాల తదితర గ్రామాల్లో విస్తరించిన శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో మైనర్ల చేత పనులు చేయిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారనే అభియోగంపై 34 మంది మత్స్యకారులపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. వైజాగ్, రాజమండ్రి, కొవ్వూరు తదితర దూర ప్రాంతాల నుంచి చేపలు పట్టేందుకు మత్స్యకారులను పిలిపించి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ శివరాముడు ఎదుట మత్స్యకారులను హాజరుపర్చగా సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్ఐ తెలిపారు.